క్లుప్తంగా

విద్యుత్ విజిలెన్స్ సీఐగా విజయనాథ్



అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకాకుళం సర్కిల్ విజిలెన్స్ సీఐగా కె.కె.వి.విజయనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక విజిలెన్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. విజిలెన్స్ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వర్తిస్తామని చెప్పారు.

గార ఎంపీడీఓగా రామ్మోహనరావు

గార: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శిమ్మ రామ్మోహనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా ఉన్న సంజీవి రమణయ్య విజయనగరానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

వ్యసనాలకు బానిస కావద్దు



మాట్లాడుతున్న ఎస్సై జనార్ధన

గార: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గార ఎస్సై ఆర్.జనార్ధన అన్నారు. మంగళవారం శ్రీకూర్మంలోని బీకేఎస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, వీటి అమ్మకాలు జరగకుండా నిఘా ఉంచామన్నారు. ఇంటికి తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా ఇంటిపై నిఘా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవోకు నివాళులు



ఈశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన లావేరు మండల విద్యాశాఖాధికారి లండ ఈశ్వరరావుకు మండల కేంద్రంలో మంగళవారం సంతాప సభ నిర్వాహించారు. వక్తలు ఈశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రజని, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతిఒక్కరూ స్వర్ణాంధ్ర–2047లో భాగస్వాములు కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ రజని పిలుపునిచ్చారు. వర్సిటీలో మంగళవారం విజన్ స్వర్ణాంధ్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి ప్రసన్న, సహాయ ప్రణాళిక అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

బృందావనంలో అష్టమి వేడుకలు

గార: మండలంలోని జొన్నలపాడు కాలనీ వద్ద బృందావనంలో మంగళవారం అష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చౌదరి దుర్గారావు దంపతులు పూజలు చేయగా వేణుగోపాల భక్తి స్వరాంజలి సభ్యులచే నామసంకీర్తన జరిగింది. అనంతరం తెలుగు వెలుగు నంది అవార్డు గ్రహీత దుర్గాప్రసాద్ పండాను సన్మానించారు. కార్యక్రమంలో కలగ ఈశ్వరరావు, రఘురాం, అప్పలరాజు, పాపారావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకుసాగాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, లాసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డీవీఎస్ఎస్ భరద్వాజ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోవిందనాయుడు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుతం అన్ని రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ విస్తరిస్తోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీ ప్రధాన సెమినార్ హాలులో డ్రోన్ టెక్నాలజీ–ఉపాధి అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. వర్సిటీ పరిశోధన అభివృద్ధి కేంద్రం, రోసిన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటీవ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

● చల్లదనోత్సవం



కళింగపట్నం పంచాయతీ నగరాలపేట గ్రామదేవత అసిరితల్లికి మంగళవారం చల్లదనోత్సవం నిర్వహించారు. ఏటా వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ముర్రాటతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. – గార

● మొక్కజొన్న రోడ్డు



మొక్కజొన్న గింజలతో నిండిపోయిన ఈ రోడ్డు జి.సిగడాం మండలం బాతువ వద్ద కనిపించింది. సమీప ప్రాంతాల రైతులు రోడ్డుకు ఒకవైపుగా కిలోమీటర్ల పొడవున గింజలు ఆరబెట్టారు. నడిమివలస సెంటర్– ఎందువ, గెడ్డకంచరాం–బాతువ, ఎస్‌పిర్‌పురం–జి.సిగడాం–వెంకయ్యపేట, జాడ – ముషినివలస– జగన్నాథవలస రోడ్లన్నీ ఇలా మొక్కజొన్న గింజలతోనే దర్శనమిస్తున్నాయి. – జి.సిగడాం

● వరద బాధితులకు సాయం



విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 72 మంది సీనియర్ సిటిజెన్స్ ద్వారా సేకరించిన రూ.1,05,000 మొత్తాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు అందించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శాంతకల్యాణ్ అనురాగ నిలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బి.మల్లేశ్వరరావు, కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

‘ఏ-కాలనీ’ చూసినా..
ఏమున్నది గర్వకారణం!

- విశాఖ ఎ-కాలనీలో పేరుకుపోతున్న చెత్త
- స్వైర విహారం చేస్తున్న పందులు
- ఎమ్మెల్యే నివాసమున్నా పట్టించుకోని సిబ్బంది



పేరుకుపోయిన చెత్తతో పందుల స్వైర విహారం

శ్రీకాకుళం రూరల్ : నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారాలు రోజుల తరబడి పేరుకుపోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నివాసం ఉన్న విశాఖ ఎ-కాలనీ పరిసర ప్రాంతంలోని క్యాంప్ కార్యాలయం దారిపొడవునా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇక్కడ రోజుల తరబడి చెత్తచెదారం పేరుకుపోవడంతో పందులు చేరి పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. విశాఖ ఎ-కాలనీ జామితోట పరిసర ప్రాంత నివాసంలో ఉన్న వారంతా చెత్తను స్థానికంగా ఏర్పాటు చేసిన చెత్త బుట్టలో వేస్తుంటారు. కొద్దిరోజుల కిందట ఇది పాడవ్వడంతో చెత్తబుట్టకు బాగు చేస్తామని చెప్పి మున్సిపల్ శానిటరీ సిబ్బంది పట్టుకెళ్లారు. తర్వాత ఇంతవరకు తిరిగి ఏర్పాటు చేయలేదు. దీంతో కాలనీవాసులంతా చెత్తను రోడ్డుమీదే పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అధిక దుర్వాసన వెదజల్లుతోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాకపోకలు సాగించే వారితో పాటు కాలనీవాసుల కూడా ముక్కున వేలేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చెత్తబుట్టను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాంకేతిక సాగుతో అధిక దిగుబడులు



రణస్థలం: పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్ఈఆర్



గార: కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు, అధికారులు

గార: వ్యవసాయంలో సాంకేతిక అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం గార మండలం శాలిహుండంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేడీ శ్రీధర్, ఏడీఏ బగ్గ రజిని, గుండ భాస్కరరావు, గొండు వెంకటరమణమూర్తి, బడగల వెంకటప్పారావు, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, అధికారులు పాల్గొన్నారు.

– రణస్థలం: రైతులకు సకాలంలో ఎరువులు అందించి, వరి ఇతర పంటలపై అవగాహన కల్పించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. రణస్థలం మండలం కోష్ట పంచాయతీలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో డీడీఏ త్రినాథస్వామి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో విజయ భాస్కరరావు, హెచ్ఓ అనూష, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, తహసీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కిష్టప్పపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు, మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి, తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండుస్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని జరజాం, డి.మత్స్యలేశం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వై.సురేష్, రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని జాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి తెగుళ్ల నివారణకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి యర్రా శారద, వ్యవసాయ శాస్త్రవేత్త కిరణ్, సర్పంచ్ గోక మహేశ్వరరావు, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు, నాయకులు కుమరాపు రవికుమార్, ఎం.చిరంజీవి, ఎం.నీలకంఠం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువతులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి, రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 100 యువతులు రక్తదానం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు, పెంకి చైతన్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పీఓ మజ్జి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై అసత్య ప్రచారాలు

- కూటమి నేతలపై మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజం



మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: లడ్డూ తయారీకీ ఎవరు మెటీరియల్ సరఫరా చేసినా ఎన్ఏబీఎల్ గుర్తించిన ల్యాబ్ నుంచి క్వాలిటీ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుందని, ఇటువంటి ఉత్తమ విధానాలు కొన్నేళ్లుగా టీటీడీ పాటిస్తున్న విషయం వాస్తవం కాదా అని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ప్రశ్నించారు. వీటిని విస్మరించి కూటమి నాయకులు అసత్య ప్రచారం దిగడం తగదన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెయ్యి ట్యాంకర్‌కూ మూడు శాంపిల్స్ తీసి మూడు టెస్టులు చేస్తారని, అవన్నీ పాసయితేనే టీటీడీ ప్రసాదంలో వాడతారని స్పష్టం చేశారు. 2014–19 మధ్య చంద్రబాబు పాలనలో దాదాపు 15 సార్లు అలా నెయ్యి, ఇతర సరుకులను వెనక్కి పంపించడం వాస్తవం కాదా ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 18 సార్లు క్వాలిటీ టెస్టులో మంచి రిపోర్టు రాకపోవడంతో ట్యాంకర్లు తిప్పి పంపారని గుర్తు చేశారు. నాణ్యత విషయంలో పాటిస్తున్న జాగ్రత్తలకు ఇది నిదర్శనమన్నారు. ఆరోపణలు వచ్చిన నెయ్యి వినియోగించలేదనే వాస్తవాన్ని మీరే చెబుతూ.. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని పచ్చి అబద్ధాలు చెప్పడం భావ్యం కాదన్నారు. 2015 నుంచి 2018 అక్టోబర్ వరకూ కేఎంఎఫ్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యికి కాంట్రాక్ట్ ఎందుకు ఇవ్వలేదని చంద్రబాబును నిలదీసే దమ్ము ఎల్లో మీడియా, కూటమి నాయకులకు ఉందా అని ప్రశ్నించారు.

రణస్థలం సబ్ రిజిస్ట్రార్‌గా తులసీదాస్



రణస్థలం: రణస్థలం సబ్ రిజిస్ట్రార్‌గా వి.తులసీదాస్ మంగళవారం విధుల్లో చేరారు. ఈయన భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఉన్న సబ్ రిజిస్ట్రార్ కె.వేణు రాజాం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకాధికారి నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల ప్రాంత రైతులకు నారాయణపురం కుడికాలువ కింద సాగునీరు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం జెడ్పీ హాల్లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సమస్య పరిష్కరించాల్సిందిగా శ్రీకాకుళం ఆర్డీవో గంగయ్యను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆర్డీవో మంగళవారం కాలువను పరిశీలించారు. అడ్డు, పూడికలను యంత్రాలతో తొలగించే కార్యక్రమం చేపట్టారు. జలవనరులు అధికారులు నిరంతరం కాలువను పర్యవేక్షించాలని, రైతులకు సాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు.

ఆర్టీసీ ఒకటో డిపో డీఎంగా అమరసింహుడు



శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్‌గా హనుమంతు అమరసింహుడు నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన మల్లికార్జునరాజు కు విశాఖ డిపో ఏటీఎంగా బదిలీ జరిగింది. అదే స్థానంలో పనిచేస్తున్న హనుమంతు అమరసింహుడు ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. త్వరలోనే డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

సుడా, మున్సిపల్ కార్యాలయంలో బదిలీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ శాంతకుమారిని పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీచేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రికల్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఎం.అన్నంనాయుడును గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీచేశారు. అన్నంనాయుడు స్థానంలో కె.రాధిక బాధ్యతలు స్వీకరించనున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు నైపుణ్యాలు కీలకమని స్వీడన్ (స్టాక్ హోం) వాల్వో కంపెనీ సీనియర్ ఇంజినీర్ కంచరాన సహజ అన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ సమన్వయకర్త నీలం సంతోష్ రంగనాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో బదిలీలు

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకాకుళం డివిజనల్ ఆపరేషన్స్ ఈఈగా పైడి యోగేశ్వరరావును నియమిస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం పలాస ఆపరేషన్స్ ఈఈగా విధుల్లో ఉన్నారు. ఈయన రాష్ట్ర విద్యుత్ ఇంజినీర్ల సంఘ ఉపాధ్యక్షునిగా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం క్వాలిటీ కంట్రోల్ ఈఈగా విధుల్లో ఉన్న జి.యజ్ఞేశ్వరరావును పలాస ఈఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీకాకుళం డివిజనల్ ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న ఎస్.బయ్యన్నాయుడును సర్కిల్ ఎంఆర్‌టీ విభాగం ఈఈగా బదిలీ చేశారు. ఇంతవరకు ఎంఆర్‌టీ ఈఈగా పనిచేసిన ఎల్‌సీహెచ్.పాత్రుడును అల్లూరి సీతారామరాజు జిల్లా ఎంఆర్‌టీ ఈఈగా బదిలీ చేశారు. వీరితో పాటు స్థానిక సర్కిల్ ఎంఅండ్‌పీ ఈఈ ఎం.సుదర్శనరావును స్థానికంగానే క్వాలిటీ కంట్రోల్ ఈఈగా బదిలీ చేశారు.

డిప్యూటీ ఈఈలుగా...

సాధారణ బదిలీల్లో భాగంగా ఆమదాలవలస ఆపరేషన్స్ డిప్యూటి ఈఈ జి.భాస్కరరావును విశాఖ కార్పొరేట్ కార్యాలయం ఎల్ఎంసీ డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళం హెచ్‌టీఎం ఈఈ బెండి రవికుమార్‌ను ఆమదాలవలస ఆపరేషన్స్ డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళం కమర్షియల్ డిప్యూటీ ఈఈ బి.పెద్దినాయుడును కమర్షియల్‌తో పాటు టెక్నికల్ డిప్యూటీ ఈఈగా బాధ్యతలిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. టీఆర్ఈ డి ప్యూటి ఈఈ చల్లా వెంకటేశ్వరరావును ఎల్‌టీఎం డిప్యూటీ ఈఈగా, ఎస్పీఎం డిప్యూటీ ఈఈ వై.రమణమ్మను టీఆర్ఈ ప్రొటక్షన్ డిప్యూటీ ఈఈగా, ఎల్‌టీసీటీఎం డిప్యూటీ ఈఈ ఆర్.సత్యనారాయణ రాజును హెచ్‌టీసీటీఎం డిప్యూటీ ఈఈగా బదిలీ చేస్తూ సీఎండీ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

నిస్వార్థ సేవలే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: నిస్వార్థమైన సేవలే లక్ష్యంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ముందుకు సాగుతుండటం శుభపరిణామమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే పురస్కరించుకుని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కళాశాల నిధులతో ఏర్పాటుచేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ఏయూ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.అనూరాధ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఆర్.శ్రీనివాస పాత్రో, సీహెచ్ చలమయ్య, ఆర్.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎం.ప్రదీప్, వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, అధికారులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సేవాభావం అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం డైరెక్టర్ కేజీజీడీ బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు

శ్రీశివానీ ఫార్మశీ కళాశాలకు నాక్ ‘ఏ’ గ్రేడ్



నాక్ ధ్రువీకరణ పత్రాన్ని ప్రదర్శిస్తున్న అకడమిక్ అధికారులు, మేనేజ్‌మెంట్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్:

చిలకపాలెంలోని శ్రీ శివానీ ఫార్మశీ కళాశాలలకు నాక్ (నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్) కమిటీ ‘ఏ’ గ్రేడ్ గుర్తింపునిచ్చిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కిరణ్ తెలిపారు. కళాశాలలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నాక్ ధ్రువీకరణ పత్రం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాక్ త్రిసభ్య కమిటీ ఈ నెల 13, 14 తేదీల్లో పర్యటించి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ప్లేస్‌మెంట్లు, ఇతర అంశాలు సమగ్రంగా పరిశీలించి అనంతరం ఏ-గ్రేడ్ ఇచ్చిందన్నారు. 2007లో కళాశాల ఏర్పాటైనప్పటి నుంచి శతశాతం ప్రవేశాలతో మెరుగైన విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతోందని వివరించారు. పదేళ్లలో అటానమస్ ఫార్మశీ కళాశాల లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ ప్రతినిధులు డాక్టర్ సనపల శ్రీనివాసరావు, దుప్పల వెంకటరావు, కనుగుల దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం శ్రీరాములు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే అండర్–14, 17, 19 చెస్ పోటీలను మంగళవారం స్థానిక హెచ్ఎం ఎం.శ్రీరాములు ప్రారంభించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం దక్కుతుంది. పోటీల నాకౌట్ దశ పూర్తికాగా, చివరి రౌండ్ పోటీలు బుధవారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పీడీ నాయుడు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సీబీఐ విచారణ జరిపించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: తిరుమల లడ్డూ విషయంలో నిజాలు నిగ్గు తేలాలంటే వెంటనే సీబీఐ, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొలివి కరుణాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారంఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే సీనియర్ ప్రొఫెషన్స్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ఏఓ నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, సిబ్బంది చిన్మయరావు, పి.చైతన్యకుమార్, రిటైర్డ్ తహసీల్దార్ పి.శేఖర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ భారత్‌లో అందరం భాగస్వాములమవుదామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు అన్నారు. మంగళవారం పర్యాటక శాఖ, నగరపాలక సంస్థ, ప్రభుత్వం జూనియర్ బాలికల కళాశాల సంయుక్తగా స్వచ్ఛతా హీ సేవా, ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా ప్రభుత్వం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, అధ్యాపకులు కె.అప్పారావు, బి.అప్పా రావు, ఇంటాక్ కన్వీనర్ డాక్టర్ రాధాప్రసాద్, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ డి.రమేష్మహాబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

శ్రీకాకుళం పాతబస్టాండ్ : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీఓ సీహెచ్ రంగయ్య అన్నారు. లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ (పి.సి.పి.ఎన్.డి.టి) చట్టం అమలుపై సబ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికలు సమానమేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీకాంత్, కిరణ్ కుమార్, స్వీప్ ఎన్.జి.ఓ కె.రమణమూర్తి, స్వచ్ఛంద సేవకుడు మంత్రి వెంకట స్వామి పాల్గొన్నారు.

వైభవంగా చెవిటి పోలమ్మ ఉత్సవాలు

జి.సిగడాం: మండలంలోని పెంట, పాత పెంట, లింగాపురం గ్రామాల్లో మంగళవారం గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పూజారి మక్క నారాయణరావు, విజయలక్ష్మి, రాధ ఆధ్వర్యంలో భక్తులు ముర్రాట్లతో వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు తలనీలాల హక్కుకు వేలం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల నుంచి మొక్కుబడిగా వస్తున్న తలనీలాలను పోగు చేసుకుని స్వాధీనం చేసుకునే హక్కుకు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు తెలిపారు.